శాంతిసరోవర్‌కు నేడు గవర్నర్‌ రాక

రాయదుర్గం: గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జరిగే కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ పాల్గొనున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బి.కె.భట్టి గిన్నీస్‌ రికార్డు కార్యక్రమాన్ని, బ్రెస్ట్‌ క్యాన్సర్‌ అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 5.45 గంటల నుంచి 6.45వరకు బృందావన్‌ గార్డెన్‌లో యోగాసనాలు ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్యక్రమంలో గవర్నర్‌, మౌంట్‌ఆబూకు చెందిన సీనియర్‌ రాజయోగి రాజు, హైదరాబాద్‌ సబ్‌ జోన్‌ ఇన్‌చార్జీ రాజయోగిని.బి.కె.కుల్‌దీప్‌ దీదీ, కిమ్స్‌–ఉషాలక్ష్మీ బ్రెస్ట్‌ క్యాన్సర్‌ సెంటర్‌ వ్యవస్థాపక డైరెక్టర్‌ రఘురాం పాల్గొంటారు.

27న ప్రత్యేక ప్యాకేజీతో ఆలయాలకు బస్సు సౌకర్యం

రాయదుర్గం: హెచ్‌సీయూ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక టూర్‌ ప్యాకేజీని ఆర్టీసీ సంస్థ నిర్ణయించిందని , నగర శివారులో ప్రజలు ఎక్కువగా వెళ్ళే దేవస్థానాలకు బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నట్టు డిపో మేనేజర్‌ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 27వ తేదీ ప్రత్యేక టూర్‌ ప్యాకేజీ ఉంటుందని పెద్దలకు రూ.350, చిన్నారులకు రూ.200 టికెట్‌ ఉంటుందన్నారు. నగర శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయం, కాళీమాత ఆలయం, అనంతగిరి పద్మనాభస్వామి ఆలయం, ఎన్కతల శనీశ్వరాలయాలకు ప్యాకేజీ వర్తిస్తుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్లు 9948082462, 7382906847లలో సంప్రదించాలని ఆయన కోరారు.

చందానగర్‌ సర్కిల్‌ టౌన్‌ప్లానింగ్‌ అధికారుల బదిలీ

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌– 21లో టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో అధికారులు శనివారం బదిలీ అయ్యారు. టౌన్‌ ప్లానింగ్‌ అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి పదోన్నతి పొంది అల్వాల్‌ అసిస్టెంట్‌ సిటీ ప్లానర్‌గా, కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌లో టీపీఎస్‌గా పని చేస్తున్న రమేష్‌ను చందానగర్‌ టీపీఎస్‌గా, చైన్‌ మెన్‌గా చేస్తున్న జావేద్‌ను యూసుఫ్‌గూడకు బదిలీ చేశారు.

స్వరార్చన

మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం చైత్ర బళ్ళ అన్నమయ్య స్వరార్చనతో సందర్శకులను అలరించారు. డాక్టర్‌ శోభారాజు శిష్యురాలు చైత్ర గణరాజ గుణరాజ, అప్పని వరప్రసాది, వినవమ్మ యశోద, ఆదిపురుష, చిత్తము కొలది, వేడుకుందామా .. కీర్తనలను ఆలపించారు. కళాకారులను సంస్థ మేనేజింగ్‌ ట్రస్టీ డా.నందకుమార్‌, శోభారాజు జ్ఞాపికలతో సత్కరించారు.

ఆదిత్యనగర్‌లో లింక్‌ రోడ్డు ప్రారంభం



లింక్‌ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చందానగర్‌ : మాదాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ఆదిత్యనగర్‌లో శనివారం కొత్త లింక్‌ రోడ్డును ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ కార్పొరేటర్‌ జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిని అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ట్రాఫిక్‌ రహిత, సుఖవంతమైన రవాణా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

'గౌలిదొడ్డి.. ఇక ఎంపీసీ క్యాంపస్‌

ఎస్సీ గురుకుల బాలుర కళాశాలలో ఐఐటీ, ఎన్‌ఐటీ సీట్ల సాధనే లక్ష్యంగా శిక్షణ

రాయదుర్గం: సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి మార్పులు చోటు చేసుకున్నాయి. అందులో భాగంగా గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలను పూర్తిగా 'ఎంపీసీ క్యాంపస్‌'గా మార్పు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు నీట్‌, ఐఐటీ, జేఈఈ, ప్రెప్‌ (ప్రిపరేటరీ) అకాడమీ ఫర్‌ బాయ్స్‌గా ఈ క్యాంపస్‌ కొనసాగింది. ఏటా రాష్ట్రంలో అత్యధికంగా ఎంబీబీఎస్‌, బీడీఎస్‌, ఐఐటీ, ఎన్‌ఐటీ సీట్లు సాధిస్తూ తనకంటూ ప్రత్యేకతను చాటింది. కానీ ఈ ఏడాది నుంచి ఐఐటీ, ఎన్‌ఐటీ సీట్ల సాధనే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. దీంతో ఇక ఈ ఏడాది నుంచి కేవలం జేఈఈ మెయిన్‌, అడ్వాన్స్‌ కోసం మాత్రమే శిక్షణ ఇస్తారు.

నీట్‌ కోచింగ్‌ కోసం 80 మంది చిలుకూరుకు

గౌలిదొడ్డి క్యాంపస్‌ను ఎంపీసీ క్యాంపస్‌గా మార్చిన నేపథ్యంలో ఇక్కడ నీట్‌ కోచింగ్‌ తీసుకునే 80 మంది విద్యార్థులను రంగారెడ్డి జిల్లాలోని చిలుకూరులో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాలకు పంపారు. దీనిని కూడా నీట్‌ కోచింగ్‌ క్యాంపస్‌గా మార్చారు. రాష్ట్రంలోని వివిధ క్యాంపస్‌ల నుంచి 140 మంది విద్యార్థులను గౌలిదొడ్డి కళాశాలకు కేటాయించారు. వీరికి ఐఐటీ, ఎన్‌ఐటీలలో శిక్షణ ఇస్తారు.

మెరిట్‌ విద్యార్థులకు ఈ క్యాంపస్‌లో చదివే అవకాశం

రాష్ట్రంలో సాంఘిక సంక్షేమ గురుకులాలలో ప్రతిభ చాటిన మెరిట్‌ విద్యార్థులకు గౌలిదొడ్డి కళాశాలల్లో చదివే అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీంతో సాధారణంగా కళాశాలలో నిర్వహించే పరీక్షల్లో మెరిట్‌ విద్యార్థులను గుర్తించి వారిని ఈ కళాశాలలో చేర్పించి జేఈఈ మెయిన్‌, అడ్వాన్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.



గౌలిదొడ్డి గురుకుల బాలుర కళాశాల

పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ

వచ్చే ఏడాది 50 ఐఐటీ సీట్లు, 50 ఎన్‌ఐటీ సీట్లు సాధించాలనే తపనతో పనిచేయాలని నిర్ణయించారు. ఈ లక్ష్య సాధనకు రెగ్యులర్‌ ఇంటర్‌ పరీక్షలతోపాటు, జేఈఈ పరీక్షల కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. దీని కోసం ప్రిన్సిపల్‌ అంజయ్య, వైస్‌ ప్రిన్సిపల్‌ గణేష్‌, అధ్యాపక బృందం సమష్టిగా కృషి చేయనున్నట్టు తెలిపారు.

సీట్ల సాధనే టాప్‌లో ఉండడమే లక్ష్యం



ప్రైవేట్‌, కార్పొరేట్లకు దీటుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ఐపీఈ కోసమే కాకుండా ఐఐటీ, ఎన్‌ఐటీల్లో సీట్ల సాధనే లక్ష్యంగా పనిచేస్తాం. విద్యార్థులకు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక బోధన, శిక్షణ ఇస్తాం.రాత్రి 7 గంటలకు స్టడీ అవర్స్‌ నిర్వహిస్తాం వారంవారం, నెలవారీగా కుములేటివ్‌ పరీక్షలను, ఆ తర్వాత ప్రీ ఫైనల్స్‌ పరీక్షలు నిర్వహిస్తాం.

– అంజయ్య, గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్‌

రూ.9.10 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



హుడా కాలనీలో బీటీరోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, నాయకులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో రూ.9.10 కోట్లతో చేపట్టనున్న పనులకు శనివారం కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌ సమస్య తీర్చేందుకు రోడ్ల విస్తరణ చేస్తున్నామని, లింకురోడ్లు ఏర్పాటు చేశామని, ఫ్లైఓవర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గంగా శేరిలింగంపల్లి పేరొందిందన్నారు. చెరువుల సుందరీకరణను కూడా దశలవారీగా చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు నరేందర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, విశాలాక్షి, రషీద్‌ అప్పారావు, నితీష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాకతీయనగర్‌లో బస్తీదర్శన్‌

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్‌ పరిధిలోని కాకతీయనగర్‌ కాలనీలో శనివారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో బస్తీదర్శన్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ పుష్ప ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్‌ కార్యాలయం ఆవరణలో బోరు వేయడానికి భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

వీనులవిందుగా..



మాదాపూర్‌: ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా గాత్రం, వేణువు, వీణ, వయోలిన్‌, మృదంగం తబలా కళాకారులు సందర్శకులను అలరించారు. శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం కీర్తన శిష్యబృందం కర్ణాటక గాత్రం, శేషం రమణ శిష్యబృందం వేణువు, విద్యాసాగర్‌ శిష్యబృందం మృదంగం, రాధిక శ్రీనివాసన్‌ శిష్య బృందం వయోలిన్‌, శాంతి చంద్రిక శిష్యబృందం వీణ, ప్రకాశ్‌ శిష్యబృందం తబలాపై అన్నమయ్య కీర్తనలు, త్యాగరాజకృతులు, శ్రీరామదాసు కీర్తనలతో అలరించారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు.

యోగా డే గోల్ఫ్‌ టోర్నీ



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీ గోల్ఫ్‌ ఫౌండేషన్‌, స్టూడియో అనంత సంయుక్తంగా ప్రత్యేక గోల్ఫ్‌ టోర్నీని నిర్వహించాయి. గచ్చిబౌలి బౌల్డర్‌ హిల్స్‌ గోల్ఫ్‌ అండ్‌ కంట్రీ క్లబ్‌ లో జరిగిన ఈ టోర్నీలో రికార్డు స్థాయిలో 124 మంది గోల్ఫర్లు పాల్గొన్నారు. గ్రాస్‌ విన్నర్‌గా అనూజ్‌ మెహతా, బెస్ట్‌ లేడీ గోల్ఫర్‌ గా రితికా శాంట్‌కేశ్వని, మెంబర్‌ కేటగిరీ విన్నర్గా రాజశేఖర్‌ రాయప్రోలు, హ్యాండీక్యాప్‌ కేటగిరీ 18 విన్నర్‌ గా టీవీఆర్‌ ప్రసాద్‌, హ్యాండీ క్యాప్‌ 19 విన్నర్‌గా జేపీ రెడ్డి నిలిచారు. విజేతలకు స్టూడియో అనంత ఫౌండర్‌ చైతన్య, కో ఫౌండర్‌ ప్రవంతి, బౌల్డర్‌ హిల్స్‌ సీఎఫ్‌ఓ మధుసూదన్‌, జనరల్‌ మేనేజర్‌ పాపిరెడ్డి, డీఎస్‌ఆర్‌ గ్రూప్‌ డైరెక్టర్‌ సాహిత్‌ రెడ్డి, ఫోకస్‌ డెంటల్‌ కేర్‌ డాక్టర్‌ అజయ్‌ కృష్ణ, నైలా ఎయిర్‌ వాటర్‌ పార్టనర్‌ మధుసూదన్‌ రావు ట్రోఫీలు అందజేశారు. బ్రీత్‌ అండ్‌ బిర్డీ పేరుతో నిర్వహించిన యోగా డే టోర్నీకి ఇంత స్పందన రావడం సంతోషంగా ఉందని బౌల్డర్‌ హిల్స్‌ గోల్ఫ్‌ అండ్‌ కంట్రీ క్లబ్‌ సీఎఫ్‌ఓ మధుసూదన్‌ రావు చెప్పారు.

కురుమ సంఘం నూతన కమిటీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని వెలిమెల బీరప్ప ఆలయంలో శనివారం జిల్లా కురుమ సంఘం కో ఆర్డినేషన్‌ సభ్యులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో రామచంద్రాపురం మండల కురుమ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కురుమ సంఘం అధ్యక్షుడిగా యాదగిరి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌, కార్యదర్శిగా రవికుమార్‌, సహాయ కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా అశోక్‌, సలహాదారుగా మల్లేశ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా అధ్యక్షులు బి.నాగేష్‌, రాష్ట్ర కురుమ సంఘం ఎన్నికల కమిటీ సభ్యులు ధనసిరి ప్రకాశ్‌లు పాల్గొన్నారు.

ప్రొ. జయశంకర్‌ సేవలు మరువలేనివి



లింగంపల్లి సర్కిల్‌ వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌ యాదవ్‌ తదితరులు



ఖాజాగూడ బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి సర్కిల్‌లో ప్రొ.జయశంకర్‌ వర్ధంతిని శనివారం నిర్వహించారు. జయశంకర్‌ విగ్రహానికి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేందర్‌ యాదవ్‌ మాట్లాడుతూ తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్‌ సార్‌ సేవలు మరువలేనివి అని కొనియాడారు. ఉద్యమంలో ఆయన పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజుయాదవ్‌, వీరేశం గౌడ్‌, మిరియాల రాఘవరావు, సోందాస్‌, శ్రీకళ వెంకటేశ్వర్లు,యాదాగౌడ్‌, గోవింద్‌ చారీ, రాంచందర్‌, భేరీ రాంచందర్‌యాదవ్‌, సంగారెడ్డి, పద్మారావు, గోపాల్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఖాజాగూడలో..

రాయదుర్గం: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత ప్రొ. జయశంకర్‌ అని బీఆర్‌ఎస్‌ నాయకుడు సాయిబాబా పేర్కొన్నారు. ఖాజాగూడలోని బీఆర్‌ఎస్‌ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు అంజమ్మ, మాధవి, నారాయణ దారుగుపల్లి నరేష్‌, రమేష్‌గౌడ్‌, నరేష్‌సింగ్‌, అలీమ్‌ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారమైనా.. డివైడర్‌ను బాగు చేయరా..?



పాతముంబాయి జాతీయ రహదారిపై డివైడర్‌ రాళ్లు



వరదనీరు పోవడానికి డోయన్స్‌ కాలనీ వద్ద డివైడర్‌ను పగులకొట్టిన దృశ్యం

శేరిలింగంపల్లి: ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపైకి డోయన్స్‌ కాలనీ వద్ద భారీగా వరదనీరు చేరడంతో పాత ముంబాయి జాతీయ రహదారిలో రోడ్డు డివైడర్‌ను కొంతభాగం కూల్చి వరదనీటిని పంపారు. ఆ తర్వాత డివైడర్‌ను మరమ్మతు చేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఈ దారి ద్వారా ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలు ఢీ కొట్టే ప్రమాదం ఉన్నా రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే వేగంగా వచ్చే వాహనదారులు డివైడర్‌ రాళ్లకు తగిలితే ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఏర్పడింది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు.

మంజీరా పైప్‌లైన్‌ రోడ్డును అభివృద్ధి చేయాలి

బీజేపీ నాయకుల నిరసన



చందానగర్‌ : హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధి మంజీరా పైప్‌లైన్‌ రోడ్డు విస్తరించాలని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌, బోయిని అనూష మహేష్‌ యాదవ్‌, డివిజన్‌ అధ్యక్షులు జితేందర్‌ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు విస్తరణపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గుంతల రోడ్డుపై ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రోడ్డు పనులు వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వివిధ కాలనీల వాసులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాలలో పని చేసే స్వీపర్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 23 తేదీ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సాయిలు, ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్‌ పిలుపునిచ్చారు. శనివారం రామచంద్రాపురం పట్టణంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే స్వీపర్‌లను పర్మినెంట్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులతో పాటు ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలేవి?

ఆల్విన్‌కాలనీ: దోమలు నీరు నిల్వ ఉన్న ప్రతి చోటా ఎక్కువగా వృద్ధి చెంది స్థానికులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ఎంటమాలజీ సిబ్బంది నాణ్యత లేని రసాయనాల పిచికారీతో ప్రయోజనం ఉండటం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై చెత్త కుప్పలు, మురుగునీటి నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. చెరువుల్లో గుర్రపు డెక్క పేరుకుపోయి మైదానాలను తలపిస్తూ దోమలకు ఆవాసంగా మారాయి. కూకట్‌పల్లి సర్కిల్‌ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, పరికి చెరువులో గుర్రపుడెక్క ఏపుగా పెరిగింది. చెరువు ఆనవాళ్లు కూడా కనిపించకుండా పచ్చని క్రీడా మైదానాన్ని తలపిస్తున్నది. మురుగునీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి. హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రగతినగర్‌ ఆలిత లాబ్‌, కిందికుంట చెరువులలో పేరుకుపోయిన వ్యర్థ జలాలతో దోమలు వృద్ధి చెందుతూ స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే దోమల వృద్ధి ఇంతగా ఉంటే భారీ వర్షాలు కురిసినప్పుడు మా పరిస్థితి ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వేసవి కాలంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, సిబ్బంది చెరువులలో, నాలాల్లో పేరుకుపోయిన వ్యర్థ జలాలు, గుర్రపుడెక్కను తొలగించాల్సి ఉండి కూడా మొద్దునిద్ర వీడలేదని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం అయితే చాలు కాలనీ, బస్తీల్లో దోమల బెడదతో సా. 4 గంటల నుంచే తలుపులు, కిటికీలు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంది.

అవగాహన కార్యక్రమాలు అంతంతే!

వారం, పది రోజులకు ఒకసారి క్షేత్రస్థాయిలో ఎంటమాలజి సిబ్బంది, సంబంధిత ఉన్నతాధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టాలి. ప్రముఖులు ఉండే కాలనీల్లోనే ఫాగింగ్‌ చేస్తున్నారన్న ఆరోపణలు సిబ్బందిపై ఉన్నాయి. నాణ్యత లేని రసాయనాలు దోమలపై ఎటువంటి ప్రభావం చూపటం లేదని పలు కాలనీల అసోసియేషన్‌ సభ్యులు పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఫాగింగ్‌ కోసం డీజిల్‌ వినియోగిస్తున్నట్లు చూపుతూ లక్షల రూపాయలు నొక్కేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



దోమలకు ఆవాసంగా మారిన ఆల్విన్‌కాలనీ పరికి చెరువు

దోమల బెడద

దోమల నివారణకు ఫాగింగ్‌ చేయకుండా తాత్సారం చేస్తున్నారు. నెలల తరబడి దోమలతో సతమతమవుతున్నాం. పరికి చెరువులో గుర్రపుడెక్కను పూర్తిస్థాయిలో తొలగించకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. తక్షణం చర్యలు తీసుకోవాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, తులసినగర్‌ అధ్యక్షుడు

యోగా.. మన జీవన విధానం

యోగా వ్యాయామం కాదు 'మన జీవన విధానం' అంటూ అంతటా యోగాసనాలు వేశారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కాలనీలు, జీహెచ్‌ఎంసీ పార్కులు, కళాశాలలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, కార్యాలయాలు ఇలా పలుచోట్ల ఉత్సవంలా చేసుకున్నారు. యోగాసనాలతో అబ్బురపరిచారు.

–శేరిలింగంపల్లి జోన్‌ బృందం



గచ్చిబౌలి 'ఎస్కీ' క్యాంపస్‌లో..



రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో..



మయూరినగర్‌ పార్కులో యోగా చేస్తున్న మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్‌ తదితరులు



టెలికామ్‌నగర్‌పార్కులో..



హుడా కాలనీలో.. పీసీసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌గౌడ్‌, కాలనీవాసులు



బొటానికల్‌ గార్డెన్‌లో ..



న్యూబ్లూమ్‌ హైస్కూల్‌లో...



హైటెక్స్‌లో..



గుల్‌మొహర్‌పార్కు కాలనీలో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో ..



మాదాపూర్‌ మెడికవర్‌ ఆస్పత్రిలో..